www.vaarthavedhikasurya.com
RNI: TGTEL/25/A0305
SCAN ME

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 2 | శుక్రవారం | 06, జూన్ 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥



## తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు

- స్టేటస్ రిపోర్ట్ వెంటనే ఇవ్వాలి
- ఆర్సీబి జట్టుకు సన్మానంపై పలు ప్రశ్నలు
- బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ

**బెంగళూరు,జూన్5(వార్త వేదిక సూర్య):** చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు చేయాలని బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. మంగళవారం స్టేటస్ రిపోర్టును పరిశీలన చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తొక్కిస్లాట ఘటనపై బెంగళూరు హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఘటనపై ప్రభుత్వానికి సంబంధించి వివరాలను అడ్వొకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. రెండున్నర లక్షల మంది స్టేడియం వద్ద చేరుకున్నారని.. తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందారని.. 56 మంది గాయాలు, 15 మంది డిశ్చార్జ్ అయ్యారని కోర్టుకు తెలిపారు. భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామని ఏజే కోర్టుకు మిగతా 2లో..



# ఉద్యోగులకు రెండు డీఏలు

- ఉద్యోగుల ఆరోగ్య పథకానికి ట్రస్ట్
- బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా 700 కోట్లు
- రిటైర్డు ఉద్యోగులను మళ్లీ తీసుకోం
- ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మన్మోహన్ పేరు
- స్వయం సంఘాల బీమా సొమ్ము స్త్రీ నిధికి
- రూ.33,194 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- మెట్రో రెండో దశకు రూ.19,579 కోట్లు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన భట్టి, పొంగులేటి
- 5 గంటల పాటు సాగిన క్యాబినెట్ భేటీ

## ఒకటి ఇప్పుడు.. మరొకటి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో..

**హైదరాబాద్,జూన్5(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక కరువు భత్యాన్ని(డీఏ) వెంటనే, మరొక డీఏను వచ్చే ఏప్రిల్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9.30 గంటల వరకు కొనసాగింది. ఐదు గంటల పాటు జరిగిన ఈ భేటీలో ఉద్యోగ సంఘాల డిమాండ్లతో పాటు పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు తెలియజేశారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ నివేదికను సమర్పించిందని తెలిపారు. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా, మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించిందని వెల్లడించారు. ప్రధానంగా డీఏ గురించి ఉద్యోగ సంఘాలు ఎదురు చూస్తున్నాయన్నారు. ఈ డీఏల చెల్లింపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని లెక్కించి, రెండు డీఏలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒకదాన్ని వెంటనే చెల్లిస్తామన్నారు. అప్పటి నుంచి బకాయి పడిన సొమ్మును 28 వాయిదాల్లో చెల్లిస్తామని తెలిపారు. మరో డీఏను వచ్చే ఏప్రిల్‌లో ప్రకటించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఉద్యోగులు హెల్త్ కార్డులు ఇవ్వాలని అడుగుతున్నారు. ఈ పథకం కోసం ప్రతి ఉద్యోగి రూ.500 చొప్పున ఇవ్వాలని, ఏడాది పాటు వాళ్లు జమ చేసిన సొమ్ముకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకోసం ఒక ట్రస్టును మిగతా 2లో..

## ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ

- పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా ముందుకు రావాలి
- సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



**హైదరాబాద్,జూన్5 (వార్త వేదిక సూర్య):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కార్యాలయం తరపున ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. ప్రకృతిని మనం కాపాడితే, అదే మనల్ని కాపాడుతుందని సీఎం స్పష్టంగా తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణగా ఉన్న నేపథ్యంలో, ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించే దిశగా కృషి చేయాలని, దానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయాలని సీఎం కోరారు. సహజ వనరుల సంరక్షణకు ప్రతిసారీ మిగతా 2లో..



## నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

- నేటి విచారణకు హాజరు కానున్న ఎంపి ఈటెల
- 9న హరీష్ రావు, 11న కెసిఆర్ విచారణకు హాజరు

**హైదరాబాద్,జూన్5(వార్త వేదిక సూర్య):** తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చింది. వీరిని విచారించేందుకు గురువారం కాళేశ్వరం కమిషన్ హైదరాబాద్ కు చేరుకుంది. విచారణలో భాగంగా శుక్రవారం బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను ప్రశ్నించనుంది. తర్వాత ఈనెల 9న బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు.. 11న మాజి సిఎం కెసిఆర్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి ప్రారంభోత్సవం వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రశ్నల వర్షం కురుపించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు మిగతా 2లో..



## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత సింహాచలం మృతి
- నెలలోపే నంబాల తరవాత మరో అగ్రనేత హతం
- సింహాచలంపై కోటి రివార్డు ఉన్నట్లు పోలీసుల ప్రకటన



**రాయ్‌పూర్,(వార్తవేదిక సూర్య):** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు టెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ గౌతమ్ ఉన్నారు. ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు కీలక మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో విస్తరించిన నేషనల్ మిగతా 2లో..



## అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కరణ

- రామ దర్బార్ విగ్రహాలకు వేదోక్తంగా ప్రాణప్రతిష్ట

**అయోధ్య,జూన్5(వార్త వేదిక సూర్య):** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో గురువారం మరో అద్భుతం చోటు చేసుకుంది. అంగరంగ వైభవంగా రామమందిర మొదటి అంతస్థులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణ, హవనంతో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది.

ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి సముదాయంలో రాజారామ్, ఇతర దేవతలను ప్రతిష్టించారు. గతేడాది జనవరిలో జరిగిన మొదటి ప్రాణ ప్రతిష్ఠ తర్వాత జరిగిన రెండవ కార్యక్రమం ఇది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుక జూన్ 3న ప్రారంభమైంది. జూన్ 5న ముగింపు వేడుకతో ముగుస్తుంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయ సేవా ట్రస్ట్ నిర్వహించింది. రామాలయంలోని మొదటి అంతస్తులో రామ దర్బార్ విగ్రహాలకు (రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు) ప్రాణ ప్రతిష్ఠతో పాటు మరో ఏడు దేవాలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది.



## మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వద్దు

- మాస్కులు ధరించే పరిస్థితి రావద్దన్న పొన్నం
- తార్నాక ఆర్టీసీ ఆస్పత్రికి పర్యావరణ అవార్డు

**హైదరాబాద్,జూన్5(వార్త వేదిక సూర్య):** మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు. ఇదిలావుంటే తెలంగాను రోడ్డు రవాణ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న తార్నాక ఆస్పత్రికి పర్యావరణ అవార్డు లభించింది. మిగతా 2లో..



## గిన్నస్ బుక్ రికార్డు సాధించేలా యోగా


- జూన్ 21 విశాఖలో 5లక్షల మందితో నిర్వహణ
- ముఖ్య అతిథిగా ప్రధాని మోడీ రాక
- రీ సైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకు వస్తాం: చంద్రబాబు

**అమరావతి,జూన్5(వార్త వేదిక సూర్య):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ యోగా కార్యక్రమం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్ మిగతా 2లో..

## ఫీజులు కట్టనందుకు ఇంత దాష్టీకమా..?

- స్కూళ్లు పెట్టింది కేవలం ఫీజుల కోసమేనా
- ఢిల్లీలోని ప్రైవేట్ స్కూలుకు హైకోర్టు చివాట్లు

**న్యూఢిల్లీ,జూన్5(వార్తవేదికసూర్య):** ఫీజులు రాబట్టుకునేందుకు విద్యార్థుల పట్ల దాష్టీకం ప్రదర్శించిన ఓ స్కూల్‌కు ఢిల్లీ హైకోర్టుగా గట్టిగా చివాట్లు పెట్టింది. స్కూళ్లు ఉన్నవి కేవలం ఫీజులు వసూలు చేయడానికే కాదని, విద్యాబుద్దులు కూడా నేర్పించాలని తెలిపింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరుపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు వసూలు మిగతా 2లో..






## 25 కోట్లమందిని పేదరికం నుంచి బయట పడేశాం

- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డిఎ కృషి
- ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్5(వార్త వేదిక సూర్య):** పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఇంతటి భారీ స్థాయి కార్యక్రమాలు జరుగుతుంటే ఎందుకు భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని కానీ ఊహించని విధంగా ఘటన జరిగిందని అడ్వొకేట్ జనరల్ తెలిపారు. తొక్కిసలాట జరిగిన సమయంలో అంబులెన్స్ లో ఉన్నాయా? అని సీజే ప్రశ్నించారు. స్టేడియం వెలుపలే అంబులెన్స్‌లు ఉన్నాయని.. అయితే లెక్కకు మించి గాయపడిన వారు ఉండటంతోనే కాస్త సమస్య వచ్చిందని ఏజే సమాధానమిచ్చారు. మెజిస్టేరియల్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని... 15 రోజుల్లోనే ఘటనపై నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. స్టేడియంలోని 21 గేట్లు- తెరిచారా? అని కోర్టు ప్రశ్నించింది. మొత్తం గేట్లు- తెరిచామని అసలు ఎందుకు తొక్కిసలాట జరిగిందో విచారిస్తున్నామని అడ్వొకేట్ జనరల్ పేర్కొన్నారు.... ఇప్పటికే నిర్వాహకులకు నోటీ-సులు జారీ చేశామని స్పష్టం చేశారు. ప్రతి విచారణను పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ చేసి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ సందర్భంగా కోర్టులోని న్యాయవాది అడ్వొకేట్ జనరల్‌కు నాలుగు సూటి ప్రశ్నలు వేశారు. జరిగిన ఘటనలోని వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారని... నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు? ఆర్సీబీ నా లేక కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ నా... లేక రాష్ట్ర ప్రభుత్వామా...? రాష్ట్రం కోసం ఆడిన ఆటగాళ్లను సన్మానించడానికి రాష్ట్రానికి ఉన్న అర్హత ఏంటి? ఎందుకు అలా చేయాలని అనుకున్నారు? విధాన సౌధ, చిన్న స్వామి స్టేడియంలో రెండు చోట్ల కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అవసరమేంటి? రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భద్రతా పరమైన చర్యలు ఏంటి? ఈ ప్రశ్నలకు అద్వకేట్ జనరల్ సమాధానాలు చెప్పాలని లాయర్ కోరారు. విచారణ అనంతరం వెల్లడిస్తామని సమాధానం చెప్పారు.

# నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-(ఎన్‌డిఎస్‌ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను శుక్రవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

# మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

టీ-జీఎస్ ఆర్టీసీ తార్నక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు దక్కింది. పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల కేటగిరిలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్ మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపులో ఆస్పత్రి చేసిన కృషికి గాను ఈ అవార్డు వచ్చింది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని సనత్ నగర్ టీ-బీపీసీబీ కార్యాలయంలో ఈ అవార్డును ఆస్పత్రి బృందానికి మంత్రి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డును టీ-జీఎస్ఆర్టీసీ ఆస్పత్రి బృందానికి ముఖ్యఅతిథిగా వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. తార్నాక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు లభించడం పట్ల ఆ సంస్థ ఎండీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణను మెరుగుపర్చడం తోపాటు-, పర్యావరణ పరిరక్షణ కొనసాగించేందుకు ప్రేరణ అని అన్నారు ఆస్పత్రిలో బయో-మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎలాస్టిక్ వేస్ట్ తగ్గింపు, ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందిగా చేస్తోన్న వైద్యులు, సిబ్బందిని ఈ సందర్భంగా సజ్జనార్ అభినందించారు.

# ఫీజులు కట్టనందుకు ఇంత దాష్టీకమా..?

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో యాజమాన్యం విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరుపై అసహనం వ్యక్తం చేసింది. డబ్బు కోసం బహిరంగంగా విద్యార్థులను అవమానించడం సరికాదని పేర్కొంది. ద్వారకాలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం 30మందికి పైగా విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తించింది. వారి తల్లిదండ్రులు సమయానికి ఫీజు చెల్లించడంలో విఫలమయ్యారనే కారణంతో బహిరంగంగా వారిని అవమానించింది. విద్యార్థులను స్కూల్ జాబితాలో నుంచి తొలగించింది. వారిని స్కూల్‌కి రాకుండా చేసింది. అందుకోసం సిబ్బందిని కూడా నియమించింది. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. పాఠశాల యజమాన్య చర్యపై అసహనం వ్యక్తం చేసింది. కేవలం డబ్బు కోసం విద్యార్థుల పట్ల ఈ విధంగా ప్రవర్తించడం సరికాదు. ఫీజు కోసం వారిని బలవంతం చేయడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. అలా చేయడం ద్వారా విద్యార్థిని మానసికంగా వేధించడమే అవుతుంది. పాఠశాలలు వాణిజ్య సంస్థల్లా ప్రవర్తించకూడదు. విద్యార్థులను లోనికి రానివ్వకుండా చేయడం విద్యా సంస్థల ప్రాథమిక ధర్మానికి విరుద్ధం అని వ్యాఖ్యానించింది. డబ్బు అర్జించడమే లక్ష్యంగా పాఠశాలలు నెలకొల్పలేదు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించడం దాని ప్రధాన విధి. పాఠశాలలకు ఫీజుల చెల్లింపునకు సంబంధించి కోర్టు జారీ చేసిన ఆదేశాలు తల్లిదండ్రులు తప్పక పాటించాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది.

# 25 కోట్లమందిని పేదరికం నుంచి బయట పడేశాం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశిరచుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

# పథకాలే ప్రచారాస్త్రాలు!

**ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఆదరణ పొందాలి**

**అన్ని స్థాయుల నేతల సమన్వయంతో పనిచేయాలి: మీనాక్షి నటరాజన్**

**మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెంట్ పరిధి నేతలతో భేటీ**



హైదరాబాద్,జూన్5 (వార్త వేదిక సూర్య): రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లి.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి ఆదరణను పొందాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెం ట్ నియోజకవర్గాల పరిధి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం జరిగింది. మీనాక్షి మాట్లాడుతూ.. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ పట్ల అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసిన వారి కి కచ్చితంగా గుర్తింపు, గౌరవం దక్కుతుందనే భరోసానిచ్చారు. కొన్నిప్రాంతాల్లో పార్టీ సీనియర్లకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య కొంత సమన్వయ లోపమున్నట్టు గుర్తించినట్లు చెప్పారు. కాగా, జిల్లాల్లోని కొంతమంది ఉన్నతాధికారులు తమ మాటను ఖాతరు చేయడంలేదని.. దీంతో పార్టీ కార్యకర్తలకు సాయం అందించలేకపోతున్నామని మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ నేతలు మీనాక్షి దృష్టికి తెచ్చా రు. ఈ విషయంపై సీఎంతో చర్చించి చక్కదిద్దడానికి యత్నిస్తానని ఆమె హామీనిచ్చినట్టు తెలిసింది. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ పథకాలను ప్రజలకు సూటిగా వివరించాలన్నారు.

క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిపై చర్యలు తీసుకోవాలంటూ మీనాక్షి నటరాజన్, మహేశ్ గౌడ్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడుతో సన్నిహితంగా ఉంటూ పెండింగ్ బిల్లులు ఇప్పిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని.. తమ ను పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఇటీవలే పార్టీలో చేరిన అచ్చంపేటకు చెందిన ఓ నాయకుడికి పదవి ఇవ్వడానికి పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టు ఇప్పటికే ఆయనపై ఫిర్యాదులున్నాయి. అలాగే మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సైతం పార్టీ కార్యకర్తలను పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలిసింది. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన మీనాక్షి.. సమీక్ష సమావేశాల సందర్భంగా మల్లు రవిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ పట్ల అంకితభావంతో పని చేస్తున్న కార్యకర్తలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఇతర పార్టీ నేతలకు వత్తాసు పలికే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

# సౌతాఫ్రికాలో రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్ యువకుడు దుర్మరణం**

హైదరాబాద్,జూన్5 (వార్త వేదిక సూర్య): సౌతాఫ్రికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మారుతీ నగర్‌కు చెందిన లిఖిత్ గౌడ్ అనే యువకుడు సౌతాఫ్రికా వెళ్లాడు. అయితే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో లిఖిత్‌గౌడ్ మృతి చెందాడు. వివరాల్లోక వెళితే.. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో బాలాపూర్ మండలం మీర్‌పేట్ కార్పొరేషన్ లోని మారుతీ నగర్‌కు చెందిన దుర్గాపతి ప్రమోద్‌గౌడ్ కుమారుడు లిఖిత్‌గౌడ్ (27) ఏడాదిన్నర క్రితం సౌతాఫ్రికాలోని బొత్స్వానాలోని స్పాట్ డ్రిల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. అక్కడ తన మిత్రులతో కలిసి ఉంటున్నాడు. గత నెల 30న కంపెనీ పని నిమిత్తం సిబ్బందితో కలిసి కారులో వెళుతుండగా వేగంగా దూసుకువచ్చిన భారీ వాహనం వారి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లిఖిత్ గౌడ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం విషయం తెలియగానే లిఖిత్ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెట్టంత కొడుకు ఇక లేడనే విషయాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కాగా లిఖిత్ మృతదేహానికి పోస్టుమార్టం కార్యక్రమాలు పూర్తి చేసి మీర్‌పేట్‌కు పంపించడానికి అక్కడి భారత హైకమిషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు

# ఉద్యోగులకు రెండు డీఏలు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తాం. దానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు. అధికారులు, ఉద్యోగుల నుంచి కొంత మంది చొప్పున ట్రస్టులో సభ్యులుగా ఉంటారు. ఉద్యోగులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా.. ఈ ట్రస్టు ద్వారా సేవలు అందిస్తారు.

- గత ప్రభుత్వం ఉద్యోగుల బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. ఈ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రతి నెలా రూ.700 కోట్లు తగ్గకుండా చెల్లించాలని నిర్ణయించాం. బిల్లుల బకాయిలను నెలవారీగా క్లియర్ చేస్తారు.
- ఉద్యోగ సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టేట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించాం.
- జీవో 317లో ఇంకా కొన్ని విభాగాలను చేర్చాలని నిర్ణయం తీసుకున్నాం.
- సచివాలయంలో ఉద్యోగుల కోటా 12.5 శాతం ఉండాలని కోరారు. దీనికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దానిని కూడా ఆమోదించాం.
- రిటైర్డ్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోకూడదని నిర్ణయించాం.
- గ్రామ పంచాయతీ కార్యదర్శుల క్యాడర్‌ను పంచాయతీ గ్రేడింగ్ ప్రకారం చేయాలని నిర్ణయించాం.
- డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీల సమావేశాలను రెగ్యులర్‌గా నిర్వహించాలని కోరారు. దానికి ఆమోదం తెలిపాం.
- ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారులను పాత స్థానాలకు పంపాలని నేతలు కోరారు. దానికీ సమ్మతించాం.
- జిల్లా పరిషత్‌లకు సంబంధించి కారుణ్య నియామకాలను చేపట్టాలని నిర్ణయించాం.
- నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ ప్రయోజనాలను రూ.2 లక్షలకు పెంచేందుకు సమ్మతి తెలిపింది.
- ఉద్యోగుల వాహన అద్దెలను వెంటనే క్లియర్ చేయాలని, ఇచ్చే ధరను పెంచాలని నిర్ణయించాం.

**రోడ్ల మరమ్మతులకు రూ.33194 కోట్లు**

- ఉద్యోగుల సమస్యలతో పాటు ఇతర అంశాలపైనా క్యాబినెట్ భేటీలో చర్చించాం. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో ఉన్న ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వర్సిటీకి తెలంగాణకు ఇవ్వడానికి సహకరించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది.
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రమాద బీమా పథకం అమలు కోసం రూ.38.5 కోట్లను స్త్రీ నిధికి కేటాయించాలని నిర్ణయించాం. బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీ నిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు లేన్ల రోడ్లు వేయాలని నిర్ణయించాం. ఆర్‌అండ్‌బీ పరిధిలో 5190 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ పరిధిలో 7947 కి.మీ.. మొత్తం 13137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పంచాయతీరాజ్ రోడ్లకు రూ.16,780 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.16,414 కోట్లను వెచ్చిస్తాం. హ్యామ్ విధానంలో రెండేళ్లలో నిర్మాణంతో పాటు 15 ఏళ్ల పాటు నిర్వహణ కూడా ఏజెన్సీలకే ఇచ్చేలా నిర్ణయం జరిగింది. పార్లమెంట్ ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.
- రాష్ట్రంలో సన్న ధాన్యాన్ని పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. సన్నాలకు బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్‌ను కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- హైదరాబాద్ సిటీలో మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు సంబంధించి 86.1 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణాన్ని రూ.19,579 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌తో చేపట్టాలని నిర్ణయించాం.
- కారిడార్-1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ.బీ కారిడార్-2లో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.బీ కారిడార్-3లో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. నిర్మాణం చేయనున్నాం.

## ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కట్టు-బడి ఉంటుందని, రాబోయే తరాల కోసం ఈ వనరులను నిలుపుదల చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఓ ప్రకటనను విడుదల చేశారు. చెట్లను పెంచాలి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. మన ఆరోగ్యం కోసం కాదు, మన భవిష్యత్ తరాల భద్రత కోసమూ పర్యావరణాన్ని కాపాడాలని అంటూ ఆమె పిలుపునిచ్చారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న వేళ, రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వన మహోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ఏడాది అనుభవాల నేపథ్యంలో, ఈసారి మరింత విస్తృతంగా చెట్ల నాటే కార్యక్రమాలను చేపట్టేందుకు మంత్రి సురేఖ అధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

పార్క్‌లో కాల్పులు కొనసాగుతున్నాయి. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భారీగా మావోయిస్టులు ఉన్నట్లు- భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి.
ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం ఆయన స్వగ్రామం. కాగా, ఈ ఘటనలో పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.
మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపుర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు- లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు. అతడు సుధాకర్‌గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ రామరాజు, సోమన్న అనే మారు పేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ. కోటి రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి -టైగర్ రిజర్వ్‌లో మావోయిస్టు సీనియర్ నేతలు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో.. డీఆర్‌జీ, ఎస్‌టీ-ఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దళాలు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగినట్టు సమాచారం. బీజాపుర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. అయితే సుధాకర్ మృతికి సంబంధించి ఎటువంటి ప్రకటను ఆయన జారీ చేయలేదు. బీజాపుర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ-కి చెందిన ముగ్గురు నాయకులను దళాలు ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం. ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ- సీనియర్ లీడర్ పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు- బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లో కార్యకలాపాలను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ ఇతర దాడుల్లో అతడు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. అతడిపై రూ.20లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో అగ్రనేతలను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోలు లొంగిపోయారు. మరోవైపు ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# గిన్నస్ బుక్ రికార్డు సాధించేలా యోగా

(మొదటి పేజీ తరువాయి)

సాధించాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలోని ఆర్కేబీచ్‌లో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించా మని తెలిపారు. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు జారీ అవుతాయని ప్రకటించారు. యోగా అనేది ప్రజలందరి జీవితంలో భాగమైందని.. ప్రజలు ఆరోగ్యవంతులు కావాలని కోరుకున్నారు. ఏపీలో గ్రీన్ కవర్ పెంచటం, గ్రీన్ ఎనర్జీ సాధించటం, సర్క్యులర్ ఎకానమీ, ప్రజల ఆరోగ్యం కోసమే యోగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్లాస్టిక్ మానవాళికి పెనుసవాల్‌గా మారిపోయిందని తెలిపారు. ఆవులు, గేదెలు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయని.. ఆ పాలనే మనం తాగుతున్నామని వివరించారు. ఏనుగులు కూడా ప్లాస్టిక్ తిని అనారోగ్యం పాలవుతున్నాయని చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడా కనిపించకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. భూతాపంతో ఉష్ణోగ్రతలు
గణనీయంగా పెరిగాయని.. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్‌గా మారిందని చెప్పుకొచ్చారు. వర్షాలు తగ్గాయి, భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి, సాగునీరు తగ్గిపోతోందని అన్నారు. భూగర్భ జలాల్లో ఎలోరైడ్ పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు.
ప్రస్తుతం ఏపీలోని 68 నియోజకవర్గాల్లో ఉన్న నగరవనాలను 175 నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రీసైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకురావాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని అనంతవరం గ్రామంలో ఏర్పాటు- చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రీసైక్లింగ్ అంశంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో పచ్చదనం పెంచేందుకు ప్రధాని నరేంద్రమోడీ చేసిన సూచనలు సైతం పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మియావాకీ గార్డెన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటూ దిశానిర్దేశం చేశారు. మలేషియా, సింగపూర్, సౌత్ కొరియా, జపాన్, అమెరికాలో మియావాకీ విధానాలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. పంచాయతీ రాజ్, పట్టణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల సమన్వయంతో ప్రతీ 15 రోజులకోసారి రీసైక్లింగ్ విధానంపై తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సైక్లింగ్‌పై మూడు ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి.. మొబైల్ వాహనం ద్వారా కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణతోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.
రోవైపు రాజధాని అమరావతిని కూటమి ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న క్రమంలో ఆ ప్రాంతలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోంది. భవిష్యత్తులో కనీసం 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. సింగపూర్, జపాన్‌తో సంప్రదించి అక్కడ ప్లాంటేషన్ ఎలా ఉందో.. అదే తరహాలో ఇక్కడ సైతం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.




## మొక్కలు నాటిన పర్యావరణ ప్రేమికుడు కొల రవీందర్ ముదిరాజ్

**సూరారం,జూన్ 05(వార్త వేదిక సూర్య):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు కొల రవీందర్ ముదిరాజ్ తన మేడపై ఇద్దరి మనుమరాలతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడకపోతే భావితరాలకు మనం ద్రోహం చేసిన వారమయితామని ప్రకృతి భూమికి గొడుగు లాంటిదని మానవ మనుగడకు రక్షణ కవచమని అన్నారు. మనం మన చుట్టూ ఉన్న చెరువులను కాపాడుకోకపోతే భావితరాలకు ద్రోహం చేసిన వారమై తామని మరియు ప్లాస్టిక్లు నివారించకపోతే ప్లాస్టిక్ మన దేశాన్ని కప్పివేస్తుందని, ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ మొదలగు రోగాలు వస్తున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తూనే ఉన్నారని తెలిపారు.



అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా విడ్డూరంగా ఉందని, ఇకనైనా మానవులు మారాలని ప్లాస్టిక్ దూరంగా ఉండాలని పర్యావరణ కాపాడాలని లో,దీని విషయమై విద్యార్థులకు పాఠ్యాంశంలో చేర్చి, వారి ఇంట్లో రెండు మొక్కలు పెట్టి, ఇంట్లో ఒక ఇంకుడు గుంత ఉన్న విద్యార్థులకు రెండు మార్కులు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తన ఇంటి ముందర మామిడి, అల్లనేరేడు, పూల చెట్టు పెంచుతున్నానని అన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించిన కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్

**సికింద్రాబాద్,జూన్ 05(వార్త వేదిక సూర్య):**
రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ఎఎంసి ఇంచార్జి రాంబాబుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ముస్లిం సోదరి సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

**- కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్**

**సికింద్రాబాద్, జూన్ 05(వార్త వేదిక సూర్య):** మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందామని మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని రెజిమెంటల్ బజార్ 01 లోని హెచ్పిసిఎల్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా ప్రశాంత్ జైన్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా కొండల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఎల్ బి నగర్, జూన్ 05(వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి గారి సోదరుడు ఎనముల కొండల్ రెడ్డి జన్మదిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ తుమ్మలూరు



మాజీ సర్పంచ్ మద్ది కర్ణాకర్ రెడ్డి మరియు చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మద్ది చైతన్య రెడ్డి, మన కింద, యూనిస్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్జీవోల కృషి అభినందనీయం

**- జ్ఞానేశ్వర్ మున్సిపల్ కమిషనర్**

**చందానగర్,జూన్ 05(వార్త వేదిక సూర్య):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, టిక్కీరైడ్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లెలగూడ చెరువు సమీపంలోని ఉద్యానవనం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మీర్పేట్ మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉన్నతాధికారి కృష్ణాదిశేషు విచ్చేయడం జరిగింది.




ఈ సందర్భంగా మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశానుసారం 100 రోజుల కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ విచ్చేసిన వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు వందరోజుల కార్యక్రమం గురించి వివరించారు. కృష్ణాదిశేషు మాట్లాడుతూ ప్లాస్టిక్ ని పూర్తిగా అంతం చేసే ప్రయత్నంలో ప్రభుత్వాలకు కొన్ని సమస్యలు ఉండటంవల్ల అది సాధ్యం కాకపోవచ్చు కానీ ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడానికి రీసైకిల్ పద్ధతిని ఉపయోగించవచ్చు అని తెలియజేశారు. ఈ సందర్భంగా




టెక్కీరైడ్ వ్యవస్థాపకులు రఘుశ్రీ(రాఘవేంద్ర) మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన ఇంటి నుండే మొదలు కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం బజారుకు వెళ్ళినప్పుడు బట్ట సంచిని పట్టుకొని వెళ్లడం అలవర్చుకోవాలన్నారు చిన్నచిన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఒక్కచోట సమీకరించి రీసైకిల్ కి పంపించేలా కృషి చేయాలన్నారు. సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పర్యావరణ మిత్ర, స్వదేశ్ భూషణ్ అవార్డ్స్ గ్రహీత డాక్టర్ టి సురేందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేయడానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జల సంరక్షణ, వన సంరక్షణ, సహజ వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తేనే ఈ భూమిపై సమస్త జీవకోటికి మనుగడ లభించగలదు అన్నారు. జీవవైవిధ్యాని కి విఘాతం కలగకుండా మన జీవన శైలి ఉండేలా కృషి చేయాలి అన్నారు. టెక్కిరైడ్, ఎకో మైత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణహిత వస్తువుల గ్యాలరీ స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను చూయించే విధంగా వస్తువులను తయారు చేస్తున్న టెక్కీ రైడ్ ఎకోమైత్రి బృందానికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు యం అశోక్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపించిన తరుణంలో ప్రతి కాలనీలో




మొక్కలు నాటి వాటి సంరక్షించే బాధ్యతను కాలనీ సంఘాలు స్వీకరించాలి అన్నారు. స్వచ్ఛంద సేవలో మా సంస్థల వాలంటీర్లు ముందుంటాం అని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్, టక్కీ రైడ్ సంస్థ వ్యవస్థాపకులు రఘుశ్రీ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్, అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం అశోక్, మమతల కోవెల మల్టీ పర్పస్ కో-ఆపరేటివ్ హెల్పింగ్ హాండ్స్ సొసైటీ వ్యవస్థాపకురాలు కే మమత, కామినేని హాస్పిటల్స్ పీఆర్వో బి యాదగిరి, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాంబే కాలనీలో నీటి మరియు డ్రైనేజ్ సమస్యలపై యాక్షన్ మోడ్‌లో కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 05(వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆర్ వాంబె కాలనీ ఆర్జీకేలో పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో స్థానికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం స్థానిక ప్రజలు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి అధికారులతో పాటు పార్టీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి గురువారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా అపార్టుమెంట్లలో డ్రైనేజీ లైన్ కుంగిపోయిన విషయం గమనించి సంబంధిత అధికారులతో ఫ్లోరింగ్ పనులపై చర్చలు జరిపారు. బిల్డింగ్‌లపై మంచినీటి సరఫరా కోసం నూతన వాటర్ ట్యాంకర్లకు సంబంధించిన ఎస్టిమేషన్ వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మంచినీటిలో వ్యర్థ పదార్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తాను. అధికారులు ప్రజల పట్ల బాధ్యతగా



వ్యవహరించాలని, సమస్యలు తలెత్తకుండానే ముందస్తుగా చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్, రఘునాథ్, హనుమంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అరుణ్, మాలతి, లక్ష్మీ, జయంతి, ఆండాలు నరసమ్మ, రవీందర్,



శంకర్ రెడ్డి, చారి, రమేష్, లక్ష్మణ్, రాజు, శంకర్, జిహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, హెచ్ఎండబ్ల్యూఎస్ సూపర్వైజర్ ప్రసాద్, జిహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

- ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి,పర్యావరణాన్ని కాపాడాలి
- పర్యావరణ పరిరక్షణకు పేపర్ కప్పులకు బదులుగా గాజు గ్లాసులు వాడాలి
- గండిపేట వెల్ఫేర్ సొసైటీ మెంబెర్ రాజశ్రీ పిన్నమనేని

**మొయినాబాద్ మున్సిపాలిటీ, జూన్ 05(వార్త వేదిక సూర్య):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పునస్కరించుకొని మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరులో గండిపేట్ వెల్ఫేర్ సొసైటీ ఎన్ జి ఓ ( ఎస్ డబ్లు ఎమ్ యూనిట్) ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా గండిపేట వెల్ఫేర్ సొసైటీ మెంబెర్ రాజశ్రీ పిన్నమనేని మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు పేపర్ కప్పులకు బదులుగా గాజు గ్లాసులు వాడాలి.. ఉస్మాన్ సాగర్ మరియు హిమాయత్ సాగర్ రిజర్వాయర్ల చుట్టుపక్కల గ్రామాలలో మేము మున్సిపాలిటీల నుండి సేకరించిన చెత్త నుండి తడి, పొడి మరియు తిరస్కరణ



వ్యర్థాలను ప్రాసెస్ చేసి పర్యావరాన్ని సంరక్షిస్తుంటాము . మొయినాబాద్ మున్సిపాలిటీలోని గండిపేట పక్కన ఉన్న చిల్కూర్ గ్రామంలో అలాంటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది చిలుకూరు లో ప్రభుత్వానికి చెందిన స్థలం పక్కనే ఉన్న భూమిలో డంపింగ్ చేయడంతో చుట్టుప్రక్కల భూములు, నీరు కలుషితం అవుతున్నాయి కాబట్టి ఈ భూమిని చదును చేసి పార్కుగా మార్చాలని



, జవహర్ నగర్‌లోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు చెత్తను బదిలీ చేసి, వ్యర్థాలను ప్రాసెస్ చేయాలని రామ్‌కి ఎన్విరో ఇంజనీర్స్ లిమిటెడ్‌ని మేము కోరాము. చెత్తను వెస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కి తరలించినందుకు రామ్‌కీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాము.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న క్లీనప్ మరియు ప్లాంటేషన్ డ్రైవ్‌ని నిర్వహించి, కొత్త సదుపాయంలో కార్యకలాపాలను ప్రారంభించాము.

# రైల్వే గోడపై రాజకీయం: శివరాంపల్లిలో క్రెడిట్ వార్, బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ!

**బీజేపీ మతి భ్రమించి మాట్లాడుతోంది**

**రైల్వే గోడపై డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ ధ్వజం!**

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 05(వార్త వేదిక సూర్య):**
శివరాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఎల్సీ నంబర్ 8 వద్ద గోడ నిర్మాణాన్ని కేంద్రంగా చేసుకొని అధికార బీఆర్ఎస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీల మధ్య తీవ్రమైన మాటల యుద్ధం కొనసాగుతోంది. గోడ నిర్మాణానికి తామే కారణమని ఇరు పార్టీల నాయకులు పరస్పరం విమర్శించుకుంటున్నారు.

గురువారం బీఆర్ఎస్ నాయకులు మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో, బీజేపీ నాయకులు "పెద్ద పేదా మాటలు" మాట్లాడుతున్నారని, గోడను తామే కట్టిస్తామని, తమ వల్లనే అవుతుందని "పనికిరాని మాటలు" మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. శివరాంపల్లి రైల్వే స్టేషన్ లోపల ధర్నా చేసి, రైల్వే ఉన్నత అధికారులకు, బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన తర్వాతే బీజేపీ నాయకులకు "కనువిప్పు కలిగిందా" అని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ప్రశ్నించారు."మీ నాయకుడు కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి గుడ్డి గుర్రాన్నివి పండ్లు ఏమన్నాతోము కుంట కూర్చున్నారా?" అని ఎద్దేవా చేశారు. బస్తీ వాసులు రైల్వే గోడ గురించి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారని బీజేపీ నాయకులు చెప్పడం "నవ్వొస్తుందని" అయన పేర్కొన్నారు . బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీజేపీ నాయకుల కంటే ముందే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని బీజేపీ నాయకులే ప్రజలకు చూపుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. "ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన వినతిపత్రానికి బదులు ఎంపీ ప్రత్యుత్తరం మాకు ఇవ్వాల్సింది. కానీ, బీజేపీ నాయకులు ఎంపీ కి ఎల్సీ 8 నంబర్ గోడ విషయం మాట్లాడితే పిలిచి మీరు ఇంకా నిద్రపోతున్నారు, ఆల్రెడీ బీఆర్ఎస్ నాయకులు మాకు శివరాంపల్లి ఎల్సీ నంబర్ 8 దగ్గర గోడ గురించి ఇచ్చి వెళ్లారు అని ఎంపీ మొట్టికాయ వేసి ఆ లెటర్ మీకు ఇచ్చినట్లు ఉందని మాకు అర్థమైంది" అని బీఆర్ఎస్ నాయకులు ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ నాయకులు "మతి భ్రమించి" మాట్లాడుతున్నారని, "సోయిలేక" మాట్లాడుతున్నారో అర్థమవుతలేదని బీఆర్ఎస్ విమర్శించింది. "మీ ఇంటి దగ్గరనే కదా గోడ కడుతుంటే మీరేం చేస్తున్నారని నన్ను ప్రశ్నిస్తున్నారాని డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ వ్యక్తిగత విమర్శలను తిప్పికొట్టారు. "ఎంపీని కాదు నేను, ఎమ్మెల్యేని కాదు, అంతకన్నా కార్పొరేటర్ ని కూడా కాదు. మీరు గోడ విషయమై మీ కార్పొరేటర్ ను నిలదీయాల్సింది పోయి మూర?త్వంతో మమ్మల్ని



ప్రశ్నిస్తున్నారు" అని ఆయన స్పష్టం చేశారు. నేను కార్పొరేటర్ అయి ఉంటే గోడ కట్టకుండా మధ్యలో అడ్డంగా పడుకునేవాడినని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ ఏమీ చేయలేరని ప్రజలకు అర్థమైపోయిందని ఆయన పేర్కొన్నారు.

తనకు ఏ పదవి లేకపోయినా, స్థానికులతో పాటు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మూడు సంవత్సరాల క్రితమే రైల్వే నిలయంలో మూడుసార్లు లేఖ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. దానికి బదులుగా మధ్యలో ఒకసారి రైల్వే అధికారులు వచ్చి పర్యవేక్షణ చేసుకుని ఇక్కడ లోకల్ కొందరితో మాట్లాడడం జరిగిందని తెలిపారు. అయితే, ఆరోజు తాము అందుబాటులో లేమని, తమ ఫోన్ నెంబర్ కూడా వాళ్ల దగ్గర లేదని వివరించారు. తాజాగా లేఖ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు రైల్వే అధికారులు స్పందించి, ఆ రైల్వే ఎల్సీ నంబర్ 8 దగ్గర గోడ కట్టడంపై సీరియస్ అయి, ఆ పని ప్రాసెస్ లో ఉంది, అయితుంది అని మాట ఇవ్వడం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఎంపీ కార్యాలయం నుంచి బీజేపీ నాయకులకు తెలిసినట్లుందని, "ఏదో బట్టకాల్చి మీదేస్తే మేం చేసినట్టు అయితుందని సంకలు గుద్దుకుంటున్నారు" అని విమర్శించారు. తోకల శ్రీనివాస్ రెడ్డి గతంలో "సొమ్మొకొడిది సోకొక్కడిది పెద్ద పెద్ద కటౌట్లు వేసినట్లు ఇప్పుడు మీరు అదే చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

"మేము పోరాడుతున్నందుకు ఫలితంగా ఎల్సీ 8 నంబర్ దగ్గర పైనుంచి బ్రిడ్జిని వేయడానికి రైల్వే అధికారులు సిద్ధమవుతుంటే మీరు మాత్రం మేము చేపిస్తుం అని చెప్పుకుంటుంటే బీజేపీ నాయకుల మీద జాలేస్తుంది" అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు "ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. మురికి నీరు పొంగిపొర్లుతున్న, విరిగిపోయిన మ్యాన్ వాల్ దగ్గర ఫోటోలు దిగుతున్నారని బీజేపీ నాయకులే ఒప్పుకుంటున్నారని, "మా నాయకుడు పనిచేస్తా లేడని మీరే చెప్పకనే చెబుతున్నందుకు ఒప్పుకున్నందుకు సంతోషం" అని బీఆర్ఎస్ వ్యాఖ్యానించింది. "మాయంబడి రండి మాయంబడి రండి అని పదే పదే చెప్తూ ప్రెస్ మీట్ పెట్టారు. అదే పత్రికాముకంగా అదే నేను అంటున్న బీఆర్ఎస్ నాయకులు బాగా పనిచేస్తున్నారని ఒప్పుకున్నట్టే కదా" అని బీఆర్ఎస్ ప్రశ్నించింది. "మీ నాయకునికి కూడా రాజకీయంగ జన్మనిచ్చింది కూడా టీఆర్ఎస్ పార్టీ ఆ రంగును చూస్తే ప్రేమ పుట్టుకొస్తున్నట్టుంది అందుకే మీ నాయకుడిని ఒప్పించి మీరు కూడా మాయంబడి రండి" అని ఆహ్వానించారు.

కొంతమంది బీజేపీ పేడ్ నాయకులు, కార్యకర్తలు "కూతలు కూసేముందు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని" బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్త, ఉప్పల్ శ్రీనివాస్, అశోక్ కుమార్, సునీల్, బొంబాయి రవి, ప్రవీణ్, సన్నీతో పాటు పలువురు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# నందనంలో నీరా, తాటి,ఈత ఉత్పత్తుల కేంద్రం తక్షణమే ప్రారంభించాలి

**రామన్నపేట,జూన్ 05(వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి జిల్లాలో కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బహిరంగ లేఖ విడుదల చేయడమైనది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేజీ కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయ రాములు మాట్లాడుతూ రేపు ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లాలో గీత కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కల్లుగీత కార్మిక సంఘం కోరుచున్నదని

యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, 8 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగింది. బిల్డింగ్ నిర్మాణం పూర్తయింది. అందుకు సంబంధించిన మిషనరీ నిర్మాణం చేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనము, మిషనరీ నేడు పడావు పడి ఉంది. దీని పనులు పూర్తి చేసి ప్రారంభించాలని అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి మొర పెట్టుకున్నప్పటికీ ఎలాంటి చలనం లేదు. తమరు వెంటనే జోక్యం చేసుకొని తగిన నిధులు కేటాయించి ఈ కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు .కల్లుగీత కార్మిక సంఘం పోరాట ఫలితంగా గతంలో నందనం లో నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఇక్కడ ఐదు ఎకరాలు టాడి కార్పొరేషన్ కు భూమిని కొనుగోలు చేసింది. విస్తారంగా తాటి ఈత చెట్లు ఉన్నాయి. కానీ దీనిని పట్టించుకోక పోవడంతో పడావు పడిపోయింది. గత టిఆర్ఎస్ ప్రభుత్వం మిషనరీ ఏర్పాటు చేసింది. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ప్రారంభమైతే జిల్లాలో మరియు రాష్ట్రము లోని వివిధ ప్రాంతాల నుండి నీరా సేకరించి ఇక్కడ శుద్ధి చేయవచ్చు. బాటిలింగ్ చేసి అమ్మకాలు చేపడితే జిల్లాలోని గీత కార్మికులకు ఉపాధి అవకాశం కలుగుతుంది. హైదరాబాదు నెక్లెస్ రోడ్ లోని



నీరా కేఫ్‌కు మరియు వివిధ ప్రాంతాలకు సమృద్ధిగా నీరా ను పంపిణీ చేయవచ్చు. ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన పానీయాన్ని అందించవచ్చు. మరియు నీరాతో బెల్లము చక్కర, చాక్లెట్లు తదితర పదార్థాలు తయారు చేయవచ్చు. తాటి ఈత కమ్మల ద్వారా బుట్టలు, బ్యాగులు, దండలు తదితర ఫ్యాన్సీ వస్తువులు తయారు చేయవచ్చు. తద్వారా గీత కార్మిక కుటుంబాల మహిళలు, యువతీ యువకులకు ఉపాధి కలుగుతుంది.. అందుకని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని. పనులు పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అదేవిధంగా జిల్లాలో 298 టిసిఎస్ లో 52 టిఎఫ్టి లలో మొత్తం 350 సంఘాలలో 14262 మంది ప్రభుత్వ లెక్కల ప్రకారం గీత కార్మికులు కల్లుగీత వృత్తి చేస్తున్నారు. వారికి ఇప్పటివరకు ప్రభుత్వం గీత కార్మికులకు వృత్తి రక్షణ కోసం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు 597 మంది కార్మికుల వరకే ఇవ్వడం జరిగింది. మిగతా కార్మికులకు అందలేదు కావున జిల్లాలోని గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచలు అందించవలసిందిగా కోరుచున్నామని తెలిపారు.. జిల్లాలో ఇటీవల వృత్తి చేస్తూ ప్రమాదాలకు గురై మృతి చెందిన 14 మంది శాశ్వత వికలాంగులైన 49 మంది తాత్కాలిక వికలాంగులైన 26 మంది మొత్తం 89 మంది గీత కార్మికులకు మందికి సుమారు మూడు కోట్ల రూపాయలను విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందించాలని కోరుచున్నాము. అదేవిధంగా జిల్లాలో తాటి ఈత చెట్ల పెంపకానికి 50 సొసైటీలకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఐదు ఎకరాల భూమికి బోరు మోటర్ కు నిధులు కేటాయించి నీటి వసతి కల్పించాలి. గీత కార్మికులందరికీ వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేసి 4000 రూపాయల పెన్షన్లు అందించాలని పైన పేర్కొన్న సమస్యలన్నిటిని పరిష్కరించాలని జిల్లా కమిటీ తరఫున కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీ కేఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు రాగిరి కృష్ణయ్య. జిల్లా ఉపాధ్యక్షులు భవండ్లపల్లి బాలరాజు. బత్తుల లక్ష్మయ్య. అంతటి అశోక్. మారగోని అశోక్. అబ్బగాని బిక్షం. జిల్లా నాయకులు ఎర్ర రవీందర్. కూనూరు మల్లేశం. మునుకుంట్ల లెనిన్. మచ్చ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వివిధ పార్టీల నుండి సిపిఎం పార్టీలో చేరిక

**ఆత్మకూరు (ఎం), జూన్ 05(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ఈ నెల 9,10,11 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే సిపిఎం పార్టీ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చెయ్యాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ మండల కార్యదర్శి వేముల బిక్షం ఆధ్వర్యంలో సిపిఎం పార్టీలో చేరడం జరిగింది. గురువారం రోజున ఆత్మకూరు మండలం పరిధిలో కొరటికల్ గ్రామాలలోని వివిధ పార్టీల నుండి సిపిఎం పార్టీలో చేరిన వాళ్లు బుష సాయిబాబు కొరటికల్ జోగు ఆదినారాయణ కొరటికల్ బుర్ర మధు కొరటికల్ మొరిగాను చంద్రయ్య తుక్కాపురం సిపిఎం పార్టీలో చేరడం జరిగింది మండల కార్యదర్శి వేముల బిక్షం అనంతరం ఆయన మాట్లాడుతూ......కేంద్రంలోని మోడీ ప్రభుత్వం



ఆధునిక కాలంలోను సమాజాన్ని తిరోగమానం వైపు తీసుకెళ్తా తుందని, ప్రపంచంలో ఎన్నో దేశాలు మన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని తమ రాజ్యాంగాలను రూపొందించుకున్నాయని, కాని మన దేశంలోని మతోన్మాద శక్తులు మన రాజ్యాంగం పై దాడులు చేస్తూ, దేశాన్ని అన్ని విధాల అదోగతి పాలు చేస్తున్నాయని విమర్శించ్చారు.

పార్టీ కార్యకర్తల త్యాగాలు, పోరాటాలపై నిర్మితమైన చరిత్రను గుర్తుచేస్తూ, సమాజంలో దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించే విధంగా అనేక అడ్డంకులను అదిగమిస్తూ, పార్టీని భలోపేతం దిశగా కార్యకర్తలను నిర్మాణ పరంగా తయారు చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న జిల్లా క్లాసులను జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కొత్త లలిత ఎస్ఎఫ్ఐ నాయకులు మారుతి హరిబాబు బుగ్గ రాములు మోసపోయిన ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం దశల వారి ఉద్యమం

### జూన్ 5 నుండి 30 వరకు గ్రామాల్లో సర్వేలు

### ఎన్పిఆర్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

**ఆత్మకూరు (ఎం), జూన్ 05 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం), మండలం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలను ఉదృతం చేస్తామని ఎన్పిఆర్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ హేచ్చరించారు.ఆత్మకూరు మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్పిఆర్డి మండల కమిటీ సమావేశంలో రచ్చ బిక్షపతి అధ్యక్షుతన జరిగింది.

ఎంఈ సందర్బంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన 11ఏండ్ల కాలంలో వికలాంగులను అన్ని రంగాల్లో మోసం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాల అమలు పర్యవేక్షణలో నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ, 2016 అర్పిడి చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నలను అడ్డుకుంటామని హేచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డు 35 కిలో బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇవ్వాలని చెబుతుంది కానీ ఇవాళ వికలాంగులు పేదల కారా వికలాంగులకు సన్న బియ్యం వద్ద అందుకోసం వికలాంగులకు 35 కిలోల బియ్యం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేసి వికలాంగుల రిజర్వేషన్స్ ఎత్తివేయాలని కేంద్రం కుట్రలు చేస్తుందని అన్నారు.గత ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని జీవో విడుదల చేసిందని, దాన్ని ఎందుకు అమలు




చెయడం లేదన్నారు. ప్రతి జిల్లాలో వికలాంగుల సంక్షేమ శాఖ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు స్థానిక సంస్థలు నామినేటెడ్ పోస్టులు మీరు ఆమె ఇచ్చిన మాట ఎందుకు అమలు చేస్తలేరు అదే మన పక్క రాష్ట్రంలో చెన్నైలో రాష్ట్ర మొత్తాన్ని గ్రామపంచాయతీలో నామినేటెడ్ పోస్టు అమలు చేయడం జరిగింది మీరు ఇచ్చిన హామీలకు ఎందుకు అమలు చేస్తలేరు వెంటనే నామిటెడ్ పోస్టులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. పెన్షన్ 6000 లకు పెంచకుండా వికలాంగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం వికలాంగులకు ఎందుకు కల్పించడం ఇప్పటికైనా వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు.

సామూహిక ప్రాంతాలను అవరోధ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన రాష్ట్రంలో అమలు కావడం లేదని అన్నారు.మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వికలాంగుల సమాఖ్యలను పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వికలాంగుల సమస్యలపై జూన్ 5 నుండి 30 వరకు రాష్ట్ర పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా మండల గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తుమని తెలిపారు. సర్వేలో గుర్తించిన సమస్యలపై దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్పిఆర్డి మండల గౌర అధ్యక్షులు వేముల బిక్షం మండల అధ్యక్షులు రచ్చ బిక్షపతి ఎంపీ ఆడి మండల ప్రధాన కార్యదర్శి సుధాగాని వెంకన్న కోశాధికారి బుర్ర మధు ఉపాధ్యక్షులు బద్దం హరిబాబు సహాయ కార్యదర్శి బి రాములు ఘనగాని చంద్రయ్య చందు జోగ హేమలత శ్రీను మజ్జిగ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ చైర్మన్ బొడ్డుపల్లి వెంకటేశ్వర్లుకు తెలంగాణ ఐకాన్ అవార్డు ప్రధానం

**మోత్కూరు, జూన్ 05(వార్త వేదిక సూర్య):** గత మూడు దశాబ్దాలుగా పైగా కూకట్‌పల్లిలో "వార్త దిన పత్రిక"లో పనిచేస్తూ ప్రభుత్వానికి ప్రజలమధ్య వారధిగా ఉంటూ ప్రజా సేవల కోసం నిరంత కృషి చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షులు కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు లకు సావిత్రిబాయి పూలే తెలంగాణ ఐకాన్ అవార్డు ను హైదరాబాద్‌లోని ఆర్టిసి క్రాస్ రోడ్ లో సిటీ కల్చరల్ సెంటర్ ఏర్పాటుచేసిన అవార్డు ప్రధానంలో తనకు ఐకాన్ అవార్డు ప్రధానం చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నాడు ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ సామాజిక సేవకులు ఉప్పు సత్యనారాయణ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక విశిష్ట సేవలను అంది స్తున్న క్రమంలో జర్నలిస్టు విభాగంలో తన సేవలను సావిత్రిబాయి ఫౌండేషన్ అధ్యక్షులు మీనగా గోపి, సీఈఓ పరమేశ్వరి, సలహా దారులు సత్యనారాయణలు గుర్తించి సినీ దర్శకులు సేవా పతి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి ఐకాన్ అవార్డు అందజేసినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ రాష్ట్ర




అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల అధ్యక్ష ,కార్యదర్శులు, గుడిసె రూబీ, స్టీఫెన్ సన్, సీనియర్ జర్నలిస్టులు జగన్ రెడ్డి, సి.హెచ్ శ్రీనివాస్, నీలగిరి ఎక్స్ ప్రెస్ ఎడిటర్ కందే వెంకట్, బ్యూరో చీఫ్ బొజ్జ నిఖిల్ , తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమృత గౌడ్, ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ ప్రధాన అధికారి ముక్కమూల వెంకన్న, విశ్రాంతి డిప్యూటీ డైరెక్టర్ కానుగంటి కిషన్, వివిధ వర్గాల నాయకులు శ్యామ్ సుందర్ రావు,



కుర్షిద్, అక్కిరాజు దుర్గ ప్రసాద్ రావు, మేడి జయరాజు, పాలకుర్తి మధుబాబు, సుభాష్ తదితరులు పాల్గొనట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

# కొండగడపలో భూభారతి రెవెన్యూ సదస్సు

**మోత్కూరు, జూన్ 05(వార్త వేదిక సూర్య):** భూ సమస్యలలో ఏలాంటి ఆటంకాలు ఉన్నా నేరుగా ప్రజలు భూ భారతి రెవెన్యూ సదస్సులలో తమ దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించు కోవచ్చని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు.

గురువారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.ఉపేందర్. ఆర్.ఐ.లు సుమన్, శ్రీనివాస్ రికార్డ్ అసిస్టెంట్ దాసరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.








# భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి

**భూదాన్ పోచంపల్లి,జూన్ 05(వార్త వేదిక సూర్య):** రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చౌటుప్పల్ ఆర్డివో శేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జి బ్లక్‌పల్లి, పెద్ద రావులపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి బ్లక్ పల్లి లో 4, పెద్ద రావులపల్లి లో 3 , రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు ఉంటే తమకు నేరుగా దరఖాస్తులు అంద జేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ నాగేశ్వరరావు, ఎం.ఆర్.ఐ గుత్తా వెంకట్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సర్వేయర్ సాయి, మాధురి, కరుణాకర్, మాజీ సర్పంచులు ఆర్ల వెంకటేష్, చిన్నలచ్చి లింగస్వామి, మాజీ ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలి

### - మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, జూన్ 05(వార్త వేదిక సూర్య):** గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ముక్తాపూర్ గ్రామంలో మున్సిపల్ ఆధ్వర్యంన



మహిళా సంఘ సభ్యులచే చెరువు కట్ట వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, భవిష్యత్తు తరాలను కాపాడు కోవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రాజేష్, వార్డ్ ఆఫీసర్లు, మెఫ్మా సిబ్బంది, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట, జూన్ 05(వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండలం ఎన్నారం గ్రామ మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్ రెడ్డి వివాహము మిర్యాలగూడలో బండి కన్వెన్షన్ హాల్లో జరగగా గురువారం అట్టి వివాహమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం,



మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి ,మాజీ సర్పంచ్ దేశపాక లక్ష్మీనరసింహ, మాజీ ఉప సర్పంచులు పల్సం భిక్షం, సామ సుధాకర్ రెడ్డి, నాయకులు మల్లయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట

**తేదీ : 05/05/2025, బుధవారం**

### శ్రీస్వామి వారి ఆదాయము రూ: 30,04,841/-

**శ్రీ స్వామి వారికి 1550 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 77,500/- |
| ప్రధాన బుకింగ్ | - | 1,16,250/- |
| కైంకర్యములు | - | Nill |
| సుప్రభాతం. | - | 8,500/- |
| బ్రేక్ దర్శనం. | - | 1,80,300/- |
| వ్రతాలు | - | 1,16,000/- |
| వాహన పూజలు | - | 9000/- |
| VIP దర్శనం | - | 2,70,000/- |
| ప్రచారశాఖ | - | 13,500/- |
| పాతగుట్ట | - | 45,980/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 3,30,500/- |
| యాదఋషి నిలయం | - | 1,22,052/- |
| సువర్ణ పుష్పార్చన | - | 77,500/- |
| శివాలయం | - | 6,400/- |
| శాశ్వత పూజలు. | - | Nill |
| పుష్కరణి | - | 650/- |
| ప్రసాదవిక్రయం | - | 10,00,840/- |
| లాకర్స్ | - | 280/- |
| అన్నదానం | - | 37,164/- |
| విమాన గోపురం | - | Nill |
| లీజెస్ | - | 5,92,360/- |
| ఇతరములు | - | 11,165/- |











## ఆర్టీఐ ఫోరం యాదాద్రి జిల్లా అధ్యక్షులుగా బండిగారి వెంకటేశం

**- నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 05(వార్త వేదిక సూర్య):** సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గా వలిగొండ మండలానికి చెందిన బండిగారి వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేసి, హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైనా వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు మరియు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రిని నిలదీయాలి

**బా.రా.స జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి**



**మోత్కూరు, జూన్ 05(వార్త వేదిక సూర్య):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యాదాద్రి జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అడుగడుగునా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో బి.ఆర్.ఎస్ కార్యకర్తలు నాయకులు ప్రజలంతా ఒక్కటై నిలదీయాలని బా.రా.స జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఆయిల్ పేడ్ మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రధాన హామీలను భాగంగా ఆసరా పెన్షన్ పెంపు, రైతుబంధు, రైతు బీమా, మహిళలకు 2500 పెన్షన్, 18 సంవత్సరాల నిండిన అమ్మాయిలకు స్కూటీ, వివాహం జరిగే అమ్మాయిలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం , మదర్ డైరీ, విజయ డైరీ, పాదా బిల్లులు చెల్లింపు చెల్లింపులు లేకపోవడం, ఏడాదిన్నర నుంచి పెండింగ్ లో ఉన్న మాజీ సర్పంచుల బకాయిలు చెల్లించకుండా జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రిని నిలదీయ వల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## ఘనంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

**మోత్కూరు, జూన్ 05(వార్త వేదిక సూర్య):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గత రెండున్నర దశాబ్దాలుగా విద్యార్థి ,యువజన ,ప్రజా సమస్యల ధ్యేయంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు మోత్కూరులోని శ్రీకాంత్ చౌరస్తా వద్ద మిత్రులతో





కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ టీ.యు. డబ్ల్యూ జె ( ఐ.జే.యు.). మండల అధ్యక్షులు ఆకవరం శ్రీనివాసులు చారి, బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య,, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, స్థానిక నాయకులు సిరిగిరి మస్తాన్, వట్టెపు శ్రీను , చిన్నారులు బుర్ర పృద్విక, బుర్ర తేజశ్రీ, కోలమోక్షిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ

**భూదాన్‌పోచంపల్లి, జూన్ 05(వార్త వేదిక సూర్య):** మండలంలోని భీమనపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా గురువారం బలిగంప బోనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పూజిస్తూ బొడ్రాయి వద్ద నైవేద్యాన్నిసమర్పించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి , వైస్



ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ కందాల భూపాల్ రెడ్డి , మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి , నాయకులు కోట మల్లారెడ్డి, బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, నోముల మాధవరెడ్డి, చిలువేరు బాల నరసింహ ,మాజీ సర్పంచ్ కంటే రాములు, మార్కెట్ డైరెక్టర్ మర్రి రాజిరెడ్డి, నాయకులు అని రెడ్డి జగన్ రెడ్డి, కంటే లింగస్వామి, సిలివేరు శేఖర్, కందాల సత్తిరెడ్డి , కందాడి రఘుమారెడ్డి, కొండల్ రెడ్డి, కలుకూరి శ్రీకాంత్ , చంద్రవా స్ రెడ్డి , కలుకూరి పాండు, ఆదిమూలం శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .

# పర్యావరణం దెబ్బతింటే మానవాళికి మనుగడకే ప్రమాదం

**మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి.సబిత**

## కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జీ






**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 05(వార్త వేదిక సూర్య):** పర్యావరణం దెబ్బతినడం ద్వారా ప్రకృతి లో సమతూల్యం దెబ్బతిని మానవాళి మనుగడకే ప్రమాదం జరుగుతుందని పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరు పై ఉన్నదని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటిన అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వ్యక్తిగతంగా మనమంతా పర్యావరణానికి దెబ్బతినకుండా ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే నష్టాల గురించి మన చుట్టుపక్కల అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని పుట్టినరోజు పెళ్లిరోజుల సందర్భంగా చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, ఉపాధ్యక్షులు యాదాసు యాదయ్య, జినుకల ప్రభాకర్, కెమ రామదాసు, మామిడి వెంకట్ రెడ్డి, బి.దినేష్ కుమార్, నోముల స్వామి, కోనూరు శ్రీనివాస్, రమేష్, సూపరిండెంట్లు రాజేంద్ర ప్రసాద్, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలను ఎదుర్కొంటున్న క్యూబాకు అండగా నిలబడండి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్**



**రామన్నపేట,జూన్ 05(వార్త వేదిక సూర్య):** అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలను ఎదుర్కొంటున్నా క్యూబా ప్రజలకు ప్రపంచం ప్రజానికం అండగా నిలబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. గురువారం రామన్నపేట మండల కేంద్రంలో ప్రపంచ అగ్ర రాజ్యం అమెరికా ఆర్థిక ఆంక్షలు విదిస్తున్న సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో క్యూభ సంగీభావ నిధి సేకరణ చేయటం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుధ సంపత్తితో చిన్న చిన్న దేశాలను బెదిరింపులకు గురించేస్తూ దేశాధినేతలను హత్య చేస్తున్న అమెరికాకు నికరంగా ఎదురునిలుస్తున్న క్యూభ దేశంపై ఆంక్షలు విధిస్తూ దేశాన్ని పేదరికంలోకి నెట్టేసే ప్రయత్నం చేస్తుందని ప్రపంచానికే వైద్యులను అందించే కమ్యూనిస్ట్ దేశానికి అండగా నిలబడి ఆర్థిక సహకారం అందించాలని పిలిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు బావండ్లపల్లి బాలరాజు,వేముల సైదులు, అవనగంటి నగేష్,మేడి గణేష్, మునికుంట్ల లెనిన్,మెట్టు శ్రవణ్ కుమార్, కునూరు మల్లేశం, ఎర్ర రవీందర్, దోమలపల్లి నర్సింహా,శానగొండ వెంకటేశ్వర్లు,పండుగ రాజమల్లు, బావండ్లపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట సిపిఐ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ రచ్చయాదగిరి



**రామన్నపేట,జూన్ 05(వార్త వేదిక సూర్య):** రామన్నపేట సిపిఐ పట్టణ 18వ మహాసభ రామన్నపేట సిపిఐ పార్టీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా రచ్చ యాదగిరి సహాయ కార్యదర్శిగా ఎన్నికల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మండల కార్యదర్శి ముత్తుకూరు నరసింహ తెలిపారు. సిపిఐ పార్టీ రామన్నపేట పార్టీ కార్యాలయంలో 18వ మహాసభ ఊటుకూరు భగవంతు అధ్యక్షతన జరిగింది.

ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సీపీఐ పార్టీ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కార్మిక కర్షక అండగా పేదలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూ ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అందుకే గ్రామ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శివరాత్రి సమ్మయ్య, సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, పల్లె మల్లేశం, గంగాపురం మల్లమ్మ, ఊటుకూరు కృష్ణ, సిహెచ్ మల్లేశం, కళ్యాణ్, యాదగిరి, పర్స సుదర్శన్ ,పట్ల నర్సింలు, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.








# ఘనంగా విగ్రహాల ఊరేగింపు...

**మోత్కూరు, జూన్ 05(వార్త వేదిక సూర్య):** మోత్కూరు పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 6 7 8 నిర్వహించే విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి ధ్వజ స్తంభం, నవగ్రహాలు, వీరభద్రుడు , పార్వతీ, కాలభైరవుడు, జంట నాగుల విగ్రహాలను అంబేద్కర్ చౌరస్తా, ఎస్.బి.ఐ,. పాత బస్టాండ్, శ్రీకాంత్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు విగ్రహాలను శ్రీ రామలింగ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆల యంలో ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభానికి పట్టణంలో మహిళలు బిందెలతో నీళ్లు పోసి తమ భక్తిని చాటుకున్నారు.

ఈ కార్యక్ర మంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్ర గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బయ్యని రాజు, ఉయ్యాల అంజయ్య, గుండు శ్రీను నేత, మందుల సురేష్, పట్టూరి అంజయ్య పాల్గొన్నారు.. ఈ ఊరేగింపులో భాగంగా మహిళలతో కోలాటం నిర్వహించారు.



## ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా

**ఆత్మకూరు (ఎం), జూన్ 05(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఘర్షకోట శ్రీనివాస్ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృధి పదంలో ముందుకూ దూసుకుపోతుంది అని ఇందిరమ్మ లబ్ధిదారులకు రేపు జరగబోయే మీటింగ్లో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ వస్తుపుల ఎల్లయ్య ఏలూరు సుదర్శన్ గ్రామ పంచాయితీ సెక్రెటరీ నరేష్ బండి మల్లేష్ ఉప్పర బోయిన దుర్గయ్య మేడి శ్రీనివాస్ కొమ్ము సంతోష్ కుమార్ బ్రహ్మచారి తదిరులు పాల్గొన్నారు.



## రెడ్డి సంక్షేమ సంఘ భవనం ప్రారంభం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 05(వార్త వేదిక సూర్య):** పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంక్షేమ సంఘం భవనాన్ని నాయకుడు గంగిడి ప్రతాప్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సంక్షేమం కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు రామస్వామి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నోముల నాగిరెడ్డి, ఏనుగు సంజీవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సగ్గు మల్ల రెడ్డి, సహాయ కార్యదర్శి కొమిరెల్లి శేఖర్ రెడ్డి, కోశాధికారి కేసరం కొండల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కోట పుష్పలత మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామల మల్లారెడ్డి , మాజీ అధ్యక్షుడు గుణంగారి సదానంద రెడ్డి, ఏనుగు కిషన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి ,బొక్క బాల్ రెడ్డి ,కొమిరెల్లి బాల్ రెడ్డి, గంగిడి సుదర్శన్ రెడ్డి,నోముల భీం రెడ్డి ,రెడ్డి సంఘం సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.








## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ,జూన్ 5(వార్త వేదికసూర్య):** దేవరకొండ నియోజకవర్గంపీఏపల్లి మండలంలో జరిగిన వివాహ రిసెప్షన్, వివాహ వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెలుగూరి వల్లపు రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్,గోలి గిరి, అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి

**దేవరకొండ,జూన్ 5(వార్త వేదికసూర్య):** దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండలం గొడుకొండ్ల వీ.టి.నగర్ గ్రామనికి చెందిన తమ్మడగోని బక్కమ్మ హన్మంతు గార్ల



కుమార్తె అలివేలు అరుణ్ కుమార్ గార్ల వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూల యాదయ్య,బాదేపల్లి నీరంజన్, తదితరులున్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలిపిన

## నల్గొండ జిల్లా మాజీ ZP ఫ్లోర్ లీడర్ శోభారాణి ఏ.వి రెడ్డి

**దేవరకొండ,జూన్ 5(వార్త వేదికసూర్య):** పీఏ పల్లి మండలంలోని గురువారం నాడు రంగారెడ్డి గుడెం గ్రామానికి చెందిన యలుగూరి (కీ.శే.) ధనంజన్ రెడ్డి సరోజ గారి కుమార్తె శృతి & సుమంత్ రెడ్డి వివాహ మహోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం





నాడు చిలుకమర్రి ప్రేమ్ గార్డెన్స్‌లో జరిగిన వివాహ మహోత్సవ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన నల్గొండ జిల్లా మాజీ ZP ఫ్లోర్ లీడర్ శోభరాణి ఏ.వి రెడ్డి పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మద్దెల ప్రసాద్ మృతి బాధాకరం

### బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**దేవరకొండ,జూన్ 5(వార్త వేదికసూర్య):** దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మామ మద్దెల ప్రసాద్ మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలో ప్రసాద్ మృత దేహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు.



అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన అన్నారు. ప్రసాద్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణం మీద హక్కులకంటే బాధ్యతలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**- రాచకొండ రమేష్**



**నల్లగొండ,జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** పర్యావరణం అనేది అందరికీ సంబంధించినది దీనిలో ఉపయోగాలు నష్టాలు అందరి మీద ప్రభావం చూపిస్తాయి కాబట్టి మనం చేసే స్వార్థపూరిత ఆలోచనలతో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నాం ఇది చాలా బాధాకరం. మన దేశం పర్యావరణ సూచీలో 176/180 ఉన్నది. పర్యావరణ పరిరక్షణ మీద ప్రపంచ దేశాలు ఎన్ని సదస్సులు పెట్టిన సంతకాలకే పరిమితం అవుతుంది కానీ పూర్తిస్థాయిలో నిర్బంధ పర్యావరణ చట్టాలు అమలు కావడం లేదు. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను విచక్షణ రహితంగా ఉపయోగించి చెట్లను కొట్టివేయడం మైన్స్ పేరుతో ఎక్కువ మొత్తంలో ప్రపంచ దేశాలలో తవ్వకాలు చైనా లాంటి దేశాలు భూమి వేగాన్ని మార్చే జల విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టడం వల్ల ప్రకృతి విపత్తులు భూకంపాలు, వరదలు, ఆమ్ల వర్షాలు, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, కరోనా లాంటి మహమ్మారి సంభవిస్తున్నాయి. పర్యావరణ రక్షణ అనేది పూర్తిస్థాయిలో అమలు అనేది చిన్నపిల్లల నుండే అంటే పాఠశాలలో తప్పనిసరిగా పర్యావరణ విద్యను అందించాలి అందరూ సామాజిక బాధ్యతగా మనిషికి మూడు మొక్కలు పెంచాలి, పర్యావరణానికి సంబంధించిన కార్యక్రమాలను, ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టి మరియు ప్రోత్సాహకాలను ఎక్కువ మొత్తంలో అందించాలి, ప్లాస్టిక్ వినియోగం వీలైనంత తగ్గించుకోవాలి నీరు వినియోగం అవసరమైన అంత వాడుకోవాలి విద్యుత్తు సాంప్రదాయ విద్యుత్ కాకుండా సోలార్ విద్యుత్ కు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి గాంధీ మాట–"భూమి మన అవసరానికి తగినన్ని వనరులను కలిగి ఉంది, కానీ మన దురాశకు కాదు"అన్నారు. ప్రకృతి వనరులను ప్రస్తుత అవసరాలకు వాడుకొని భవిష్యత్తుకు అందించడం మనందరి సామాజిక బాధ్యత. ప్రకృతిని ప్రేమించి, పర్యావరణాన్ని కాపాడుకుంటె అది మనకు వెయ్యి రెట్లు తిరిగి ఇస్తుంది, సుస్థిరాభివృద్ధి 17 లక్ష్యాలను 2030 వరకు సాధించడానికి అందరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

# ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

### ప్రొసీడింగ్ జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి.

### టియుడబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి

**నల్లగొండ,జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 ఫీజు రాయితీ ప్రొసీడింగ్ ను జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి గురువారం జారీ చేశారు. కేయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరుతూ డీఈవో బొల్లారం బిక్షపతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించి జిల్లా విద్యాధికారి ప్రొసీడింగ్ ను జారీ చేసిన సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ డిఇఓ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరం అన్నారు. దీనికి స్పందించిన డిఇఓ,అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు అందించడానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఏదైనా పాఠశాల యాజమాన్యం వినకపోతే,దానిని తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు టియుడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె నాగయ్య, మాధురి యాదగిరి, ఏరెట్ల చంద్రశేఖర్ రెడ్డి, వంగాల శ్రీనివాసరెడ్డి, దోటి శ్రీనివాస్, జిల్లా యాదయ్య, సుధాకర్, అంజయ్య, దశరథ, సమద్, వెంకటేశ్వర్లు, అశోక్, రామ కృష్ణ, కృష్ణ, రాంప్రసాద్, సత్యం, సోమ చంద్రశేఖర్, రాంప్ర పసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి చిట్యాల మున్సిపాలిటీ నూతన కమిటీ ఏర్పాటు

**చిట్యాల, జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** బిజెపి చిట్యాల మున్సిపాలిటీ నూతన కమిటీని ప్రకటించిన అధ్య క్షులు గుండాల నరేష్ గౌడ్ గురువారం రోజున చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ మున్సిపాలిటీ బీజేపీ పూర్తి కంపెనీ నియామకం చేయడం జరిగింది



**ఉపాధ్యక్షులుగా..**

ముప్పా సుకేందర్ రెడ్డి (రెడ్డి), అమరోజు సునిత (bc) వైరాల రావుల్ - bc వెలిమినేటి బాను ప్రకాష్ రెడ్డి (oc)

**ప్రధాన కార్యదర్శిగా :**

కందటి చంద్ర రెడ్డి–oc, సుంచు శ్రీను– sc

**కార్యదర్శులుగా**

బెల్లి నరేష్ యాదవ్ bc
నాలావత్ కృష్ణ st
కన్నెబోయన మురళి యాదవ్ bc
నల్ల మల్లారెడ్డి, బొక్క ధనుంజయ్ రెడ్డి

**కోశాధికారిగా**

దేవర పల్లి సురేందర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు
మాస స్వరూప sc, చికిలం మెట్ల సుజాత bc
కొండా శ్రవణ్ గౌడ్ bc
అమరోజు గోవర్ధన్ bc ముక్కామల పరమేష్

ఏళ్ల సాయిరాం నియామకం జిల్లా అధ్యక్షులు నియమించడం జరిగిందని మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్ తెలిపారు ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు.

### శ్రీశ్రీశ్రీ సీతారాముల శివాలయ ఆంజనేయ స్వాముల వారి

# నూతన ఆలయ ప్రారంభోత్సవం మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**దేవరకొండ, జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని తెల్దేవరపల్లి (సెంటర్)లో గురువారం నాడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారాముల శివాలయ ఆంజనేయ స్వామి ల వారి నూతన ఆలయ ప్రారంభోత్సవం మరియు ధ్వజస్తంభ నిర్మాణం 2,60,000రూ,, అక్షరాల రెండు లక్షల అరవై వేల రూపాయలతో చేయించిన దాతలు జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి గార్లకు ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

అనంతరం శ్రీశ్రీశ్రీ సీతారాముల శివాలయ ఆంజనేయ స్వామి ల వారిని దర్శించుకొని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి పిసిసి సభ్యులు చందంపేట పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ఈ సందర్భంగా నరసింహారెడ్డి గార్కి ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, బందేల తిరుపతయ్య, మరియు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్

**నల్లగొండ,జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న నల్గొండ సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు గురువారం రెండో రోజుకు చేరు కున్నాయి. అస్తిత్వ ఉద్యమాలు, రాజకీయాలు, ప్రయోజనాలు అనే అంశంపై ఆయన వివరించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వెంటనే వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్లో రైతులుకి అవసరమైన నాణ్యమైన




ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. సాగుకు అవసరమైన పచ్చి రొట్టె జీలుగు, పెసర్లు ఉచితంగా అందజేయాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న చివరి భూముల వరకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న రైతుబంధు 2 లక్షల లోపు అందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా గత మూడు సీజన్లో పెండింగ్లో ఉన్న రైతు భరోసాను ఈ సీజన్ తో కలుపుకొని వెంటనే రైతులకు అందించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే హామీలను అమలు చేసి చిత్తశు ద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రిన్సిపాల్ గా పాలడుగు నాగార్జున ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డబ్బికార్ మల్లేష్ పాలడుగు ప్రభావతి చినపాక లక్ష్మి నారాయణ వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికడదాం - పర్యావరణాన్ని కాపాడుదాం"

### 'పర్యావరణ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ '

### డాక్టర్ ఇర్ఫాన్ ఆక్షన్ ఎయిడ్ ప్రోగ్రామ్ లీడ్

**భువనగిరి/వార్తా వేదిక సూర్య :** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికడదాం - పర్యావరణాన్ని కాపాడుదామని ఆక్షన్ఎయిడ్ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆక్షన్ఎయిడ్ ఆధ్వర్యంలో ఈరోజు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతీ సంవత్సరం ప్లాస్టిక్ వినియోగం అంతకు అంతగా పెరుగుతున్నదని దీని మూలంగా పర్యావరణానికి ఎంతో ముప్పు వాటిల్లుతుందని అన్నారు.ప్రముఖ పర్యావరణవేత్త సాగర్ ధార మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈసంవత్సరం ప్లాస్టిక్ ని అంతం చేద్దాం అనే దీమ్‌తో అన్ని దేశాలు ఈరోజు కార్యక్రమాలు



జరుపుతున్నాయని అన్నారు.

ప్లాస్టిక్ వినియోగం అధికామవ్వడం మూలంగా మొత్తం జీవ వైవిద్యానికే ప్రమాదం వచ్చిపడిందని, ప్లాస్టిక్ కాలుష్యం మూలంగా భూతాపం పెరిగి సహజ వనరులు, జలవనరుల లభ్యత తగ్గుతున్నదని, భూసారం క్షీణిస్తుందని అన్నారు. మరోవైపు అటవీ విస్తీర్ణం కుచించుకుపోవడంతో వృక్షి మరియు జంతు సముదాయాల సంఖ్య అంతరించిపోతుందని అన్నారు.

జిల్లా పశు గణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఏరువాక కేంద్రం, డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్ లు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల జీవకోటి మనుగడే ప్రమాదకరంగా మారిందని, పశు వులు, మూగ జీవాలు సైతం ప్లాస్టిక్ మూలంగా అనారోగ్యం పాలౌతున్నాయని అన్నారు.వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువుల వాడకం కూడా అనేక రోగాలకు కారణమవుతున్నదని క్రమంగా రైతులందరు సేంద్రీయ వ్యవసాయం వైపు ఆలోచనలు చేయాలన్నారు.అనంతరం పోస్టర్ ఆవిష్కరణ మరియు సంతకాల ప్రచార ఉద్యమ క్యాంపెన్ జరిగింది.ఈకార్యక్రమానికి కమ్యూనిటీ ట్రైనర్ సురుపంగ శివలింగం సమన్వయం చేయగా ఎల్ ఆర్పీ ప్రతినిధులు కవిత, శోభారాణి, చంద్రకళ, మాధవి, కానుగంటి శ్రీశైలం, ప్రతిభ, భానుకుమార్, జగన్, నర్సింహ రాజు లు ప్రసంగించగా అరవై మంది ప్రతినిధులు పాల్గొన్నారు.




## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు : ఆర్డీవో శేఖర్ రెడ్డి

**చౌటుప్పల్, జూన్ 05(వార్త వేదిక సూర్య):** గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలములోని నేలపట్ల, ఖైరతాపూర్ గ్రామాలలో



గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సులలో సదాబైనామా, మోటివేషన్, పౌతీ తదితర సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.
ఈ కార్యక్రమాలలో మండల తహసీల్దార్ వీరాబాయి, డిప్యూటీ తహసిల్దార్ సిద్ధార్థ కుమార్, ఆర్ ఐ బాణాల రాంరెడ్డి తదితర రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..

**పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం**

**సీఎంకు, రెవెన్యూ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన పూర్వ రామ రెవెన్యూ అధికారులు**

**ఆలేరు/వార్తా వేధిక సూర్య:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే గ్రామ పరిపాలన అధికారుల(జీపీఓ) నియామకం జరుగుతుందని తెలంగాణ పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులసంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల



బాలకృష్ణ అన్నారు . రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామానికో అధికారిని నియమించబోతున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతంతో భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుందన్నారు. జీపీఓల నియామకంతో రెవెన్యూ వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగా,మరియు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి లచ్చి రెడ్డి మరియు పూర్వ గ్రామ రెవెన్యూ అధికారు ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు తో ఇదంతా సాధ్యమైందన్నారు.
జీపీఓల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతుంది.
భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపే లక్ష్యంతోనే రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని, భూ భారతిపై భూ యజమానులకు, రైతులకు, ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు.

## పలు శుభకార్యాలకు హాజరైన మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య

**నార్కట్‌పల్లి, జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలో గల యస్.ల్.ఆర్ గార్డెన్స్ నందు జరిగిన బెండల్ పహాడ్ అవాస గ్రామమైన బాకిగుడెంకి చెందిన వంగాల ఎల్లయ్య గారి కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. చిట్యాల పట్టణ



కేంద్రంలో గల రాజరాజేశ్వరీ ఫంక్షన్ హాల్ నందు జరిగిన పెద్దకాపర్తి గ్రామ మాజీ ఉప సర్పంచ్ పొట్లపల్లి స్వామిగారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి,



దివీస్ పరిశ్రమలో ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**చౌటుప్పల్, జూన్ 05(వార్త వేదిక సూర్య):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి లు పలు వార్డులలో మొక్కలు నాటి నీరు పోశారు. స్థానిక నాగుల కుంటలో ఉన్న వ్యర్థాలను, ప్లాస్టిక్ ను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ పోలోజు వనజ అనిల్, మార్కెట్ డైరెక్టర్ ఢిల్లీ చంద్రకళ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దండు మల్కాపురంలో.....**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దండు మల్కాపురం రైతు వేదిక వద్ద యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**దివిస్ పరిశ్రమలో..:** చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని దివీస్ పరిశ్రమలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్ రామకృష్ణ పర్యావరణ భద్రతా సూచిక కరపత్రాలను ఆవిష్కరించి పరిశ్రమ ఉద్యోగులకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్యం గురించి పరిశ్రమ ఉద్యోగులకు పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్లాస్టిక్ రహిత పర్యావరణము కోసం ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాలలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ లు జి హేమంత్ కుమార్, పి శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు పెండ్యాల సుధాకర్, జి బాలకిషోర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి వి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**పంతంగి గ్రామంలో....**

చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సహస్ర ఫౌండేషన్ మిషన్ గ్రీన్ ఇండియాలో భాగంగా గ్రామ పిహెచ్ సీ సెంటర్ ఆవరణంలో, పట్టణ కేంద్రంలోని గాంధీ పార్క్ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతల శ్రీకాంత్, సిఎచ్వో జ్యోతి, సాయి, లింగస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఒకరు నాటి నీరు పోస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే పద్దతులు పాటించాలి

**వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాత, వాణిశ్రీలు**

**చౌటుప్పల్, జూన్ 05(వార్త వేదిక సూర్య):** వ్యవసాయంలో రైతులు తక్కువ పెట్టు ఎక్కువ దిగుబడులను సాధించే పద్ధతులను పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాత, డాక్టర్ వాణిశ్రీ లు తెలిపారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలోని రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డా. సుజాత, డా.వాణిశ్రీ లు మాట్లాడుతూ వ్యవసాయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పద్ధతులు, తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుట, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, ఎరువులు, పురుగు మందులు కొన్నపుడు వాటి రసీదులను పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరిచుకోవటం, సాగునీటిని ఆదా చేసే మార్గాలను, పంట మార్పిడి, చెట్లను



పెంచుట, వరి, పత్తి పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ గురించి, మేలైన విత్తన వంగడాల గురించి పూర్తి సమాచారంను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులందరూ జిలుగ లాంటి పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని, పిఎస్ బి ఎరువులని వాడి అధిక దిగుబడి పొందాలని, రైతులందరూ వరి సూటి రకం ఎరువులు వాడి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బోయ వెంకట్, మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, సింగిల్ విండో మాజీ చైర్మన్ చీర్కే సంజీవరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి వెన్నెల, రైతులు పాల్గొన్నారు.







## అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాల పంపిణీ

**నల్లగొండ, జూన్ 5 (వార్తా వేదిక సూర్య):** మునుగోడు నియోజకవర్గం వ్యాప్తంగా మొదటి దశలో అర్హులైన నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారు లకు మునుగోడు లోని క్యాంపు కార్యాలయం వద్ద అట్టహాసంగా పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇల్లుల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చండూరు మున్సిపాలిటి, చండూరు, మునుగోడు, నాంపల్లి, మర్రిగూడెం, గట్టుప్పల్



మండలాలలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లుల మంజూరి పత్రాలను నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం తో కలిసి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ..

ఇండ్లు మంజూరు అయిన ప్రతి ఒక్క లబ్దిదారునికి పేరు పేరునా శుభాకాంక్షలు, ఇండ్లు రాని వాళ్ళు అధైర్య పడొద్దు అర్హులైన పేద వాళ్ళందరికీ ఇండ్లు ఇప్పించే బాధ్యత నాది. మునుగోడు నియోజకవర్గం లో కనీసం 10 000 (పదివేల) ఇండ్లు మంజూరి అవసరం ఉంది.. కానీ ప్రస్తుతానికి 3500 మంజూరు అయ్యాయి, పదవీ ఉన్నా లేకున్నా. నా జీవితము మునుగోడు ప్రజలకు అంకితం. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా చెబుతున్నా... కాంగ్రెస్, బిజెపి,టిఆర్ఎస్ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లులు మా ప్రభుత్వం ఇస్తుంది.

నియోజకవర్గంలో కనీసం పది వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు కావాలి ,ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా. ఇల్లు రానివారు ఎట్టి పరిస్థితిలో బాధపడొద్దు, భయపడొద్దు, అధైర్య పడొద్దు, మొదటి విడతన అర్హులైన నిరుపేదలకు 3500 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం, తక్కినవారందరికీ రెండవ విడతలో



ఇల్లులు ఇస్తాము, ఇల్లు అనేది ఆత్మ గౌరవం, గత పది సంవత్సరాలలో ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇల్లు కట్టిన పాపాన పోలేదు. అర్హులు ఏ ఒక్కరు ఇందిరమ్మ ఇళ్లు లేకుండా ఉండరాదు, అదే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ఇల్లు రాకూడదు, ఈ బాధ్యత అధికారులపై ఉంది, కొంత మంది నిరుపేదలు ఇదివరకే బేస్మెంట్ నిర్మించుకున్నారు, అలాంటి వారికి సైతం ఇల్లు ఇచ్చే విధంగా ప్రభుత్వానికి లేఖ రాయాలని జిల్లా కలెక్టర్ కు సూచన చేసారు. ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకంగా ఉండాలి, ప్రభుత్వం ఇంటి కోసం మంజూరు చేస్తున్న 5 లక్షల రూపాయలు సరిపోవని ,ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నల్గొండ జిల్లాలోని అన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నందున డిస్కౌంట్ పై సిమెంట్ ఇచ్చే విధంగా లబ్ధిదారులకు మేలు జరిగేలా మాట్లాడతా, నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తాను నిరుపేద కుటుంబాల అందరికీ సొంతింటి కళ నెరవేరే వరకూ పోరాడుతా, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ..సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషం, నియోజకవర్గంలో సుమారు పది వేల మంది వరకు నిరుపేదలు ఉన్నారు, వారందరికీ ఇల్లు రావాల్సిన అవసరం ఉంది. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా ఫ్లోరైడ్ ప్రాంతమని ,సుమారు 1500 ఫీట్లు



బోరూ వేసినా నీరు పడని పరిస్థితి..

అర్హులకే అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూసే బాధ్యత అధికారులపై ఉంది, అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా డిండి,ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లంల సాగునీటి ప్రాజెక్టుల పూర్తయితే మునుగోడు సస్యశ్యామలం అవుతుంది, క్షేత్ర స్థాయిలో మరోసారి పూర్తిగా పరిశీలించి అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్న అన్నారు, ఈ కార్యక్రమం లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,రెవిన్యూ. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, తదితరులు హాజరయ్యారు.


# వాయిదాల సమ్మర్... మొత్తం వేస్ట్?






టాలీవుడ్ లో రిలీజ్ డేట్ల సమస్య బాగా పెరిగిపోయింది. తెలుగు సినిమా స్థాయి విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రతీ విషయంలో జాగ్రత్త పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో మేకింగ్ కు చాలా టైమ్ పడుతుంది. ఫలితంగా సినిమా అనుకున్న టైమ్ కు రిలీజ్ చేయలేకపోతున్నారు. ఆల్రెడీ లాక్ చేసుకున్న డేట్ కు ఆ సినిమాలు రాకపోవడంతో మంచి డేట్ ను మిస్ అవడంతో పాటూ ఆ సీజన్ ను డ్రై సీజన్ గా మార్చేస్తున్నారు. గత మూడేళ్లుగా టాలీవుడ్ సమ్మర్ ను ఏ సినిమా వాడుకోలేకపోతుంది. 2025 సమ్మర్ ను కూడా టాలీవుడ్ వేస్ట్ చేసుకుంది. ఈ ఇయర్ సమ్మర్ లో శ్రీవిష్ణు సింగిల్ తప్ప మిగిలిన ఏ సినిమా పెద్దగా ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేయలేకపోయింది. సమ్మర్ రిలీజ్ కోసం ఎన్నో మీడియం బడ్జెట్ సినిమాలు ప్లాన్ చేసుకున్నప్పటికీ రేసులో పెద్ద సినిమాలు ఉండటంతో పోటీ ఎందుకని సైలెంటయ్యారు. కానీ ప్లాన్ చేసుకున్న పెద్ద సినిమాలు వాయిదా పడ్డాయి. సమ్మర్ లో రిలీజ్ చేయాలనుకుని చేయలేకపోయిన మూడు పెద్ద సినిమాల్లో మొదటిగా చిరంజీవి విశ్వంభర ఉంటుంది. వాస్తవానికి ఈ సోషియో ఫాంటసీ సినిమా 2025 సంక్రాంతికే రిలీజవాల్సింది కానీ గేమ్ ఛేంజర్ అప్పటికే లేటవడంతో ఆ సినిమా సంక్రాంతికి వస్తుందని విశ్వంభరను వాయిదా వేసి మే 9న రిలీజ్ చేస్తామన్నారు. దీంతో మే 9న రిలీజవాల్సిన చాలా సినిమాలు వాయిదా పడ్డాయి. కానీ వీఎఫ్ఎక్స్ కారణంగా విశ్వంభర మే 9న కూడా రిలీజ్ కాలేదు. విశ్వంభర సినిమా మే 9న రావడం లేదని తెలిసి, ఆ డేట్ లో ఎంతో కాలంగా ప్రొడక్షన్ లో ఉన్న పవన్ కళ్యాణ్ సినిమా హరి హర వీరమల్లును రిలీజ్ చేద్దామనుకున్నారు. కానీ పవన్ కళ్యాణ్ పోర్షన్ షూటింగ్ పెండింగ్ లో ఉండటం వల్ల మే 9న వీరమల్లు రాలేదు. రీసెంట్ గానే పవన్ ఈ సినిమా షూటింగ్ ను పూర్తి చేయగా, వీరమల్లు జులై లో రిలీజ్ కానుంది. మే 9న వీరమల్లు రిలీజవుతుందనే కారణంతో కూడా చాలా సినిమాలు తమ సినిమా రిలీజులను వాయిదా వేసుకున్నారు.

ఈ రెండింటితో పాటూ విజయ్ దేవరకొండ- గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న కింగ్‌డమ్ సినిమా కూడా మే 31న రిలీజ్ కావాల్సి ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ఆలస్యం అవడంతో




కింగ్‌డమ్ సినిమా కూడా వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమా జులై 4న రిలీజ్ కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. దీంతో కింగ్‌డమ్ కూడా సమ్మర్ లో రిలీజవలేదు.

## టింబర్ డిపోలో ప్రభాస్

ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేస్తున్నాడు. కానీ అభిమానుల టైం బాగా లేకపోవడంతో అవి ఏవో కారణాల వల్ల ఆలస్యం అవుతూ ఉన్నాయి. ప్రభాస్, మారుతి కాంబోలో రూపొందుతున్న రాజాసాబ్



సినిమా మొన్న ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సి ఉన్న విషయం తెల్సిందే. కానీ సినిమా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇటీవలే ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్ సినిమాను పక్కన పెట్టి ఫౌజీ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ఇదే ఏడాదిలో విడుదల చేయాలని ప్రారంభించే సమయంలో అనుకున్నారు. కానీ అది కూడా సాధ్యం అయ్యేలా లేదు. ప్రస్తుతం ప్రభాస్ రామోజీ ఫిల్మ్ సిటీలో ఫౌజీ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన టింబర్ డిపో సెట్‌లో ప్రభాస్ భారీ యాక్షన్ సీన్స్‌లో నటిస్తున్నాడు. విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీగా ఈ సినిమాను హను రాఘవపూడి రూపొందిస్తున్నాడు. ఆయన గత చిత్రాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా సెన్సిబుల్‌గా ఉంటుందని, అంతే కాకుండా మెచ్యూర్డ్ లవ్ స్టోరీని కలిగి ఉంటుంది అంటూ చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెప్పుకొచ్చారు. ఆకట్టుకునే కథ, కథనంతో దర్శకుడు హను రాఘవపూడి రూపొందిస్తున్న ఫౌజీ సినిమా షూటింగ్ దాదాపుగా సగం పూర్తి అయిందని తెలుస్తోంది. సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి వర్కింగ్ టైటిల్‌గా ఫౌజీ కొనసాగుతూ వస్తుంది. అయితే ప్రధాన టైటిల్ మాత్రం ఇది కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. హను రాఘవపూడి సినిమాలన్నింటికి విభిన్నమైన టైటిల్‌ను పెడుతూ ఉంటాడు. కనుక ఈ సినిమాకు సైతం అదే తరహాలో విభిన్నమైన టైటిల్‌ను షూటింగ్ పూర్తి అయిన తర్వాత ఖరారు చేస్తాడేమో చూడాలి. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ ఇమాన్వి నటిస్తోంది. ఆ మధ్య ఈమెను కొందరు పాకిస్తానీ అంటూ విమర్శించడంతో సినిమా విషయమై అనుమానాలు వ్యక్తం అయ్యాయి.



## 2026 సంక్రాంతికి రవితేజ, కిషోర్ తిరుమల కొత్త చిత్రం

ఎలక్ట్రిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎఫర్ట్ లెస్ యాక్టింగ్, అద్భుతమైన కామిక్ టైమింగ్ తో అలరించే మాస్ మహారాజా రవితేజ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి రవితేజ76 ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. క్వాలిటీ, హై ఎంటర్ టైన్మెంట్ వాల్యూస్‌తో సినిమాలని అందించడంలో పాపులరైన ప్రతిష్టాత్మక ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం ముహూర్తపు వేడుకతో ఘనంగా ప్రారంభమైంది.

దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు.

అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ వెరీ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్ సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అతను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది. అతను పట్టుకున్న పుస్తకంలో "సీ ఇట్ & సే ఇట్" స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది.

ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ధమాకా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు.

## 'లక్ష్మీ నరసింహా' రీరిలీజ్ కూడా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

**-నిర్మాత బెల్లంకొండ సురేష్**

గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ 'లక్ష్మీ నరసింహా' మరోసారి థియేటర్స్ లో అలరించడానికి సిద్ధమైయింది. జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత



బెల్లంకొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైన ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో జూన్ 8న థియేటర్స్ లో వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ వెర్షన్ లో కొత్త పాట యాడ్ చేశారు. 'మందేసినోడు' అంటూ సాగే పాటని భీమ్స్ సిసిరోలియో అన్ స్టాపబుల్ వైబ్ తో కంపోజ్ చేశారు. స్వరాగ్ కీర్తన్ హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్ కి ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ మాస్ ని కట్టిపడేసే లిరిక్స్ అందించారు. రీరిలీజ్ ప్రెస్ మీట్ లో ఈ సాంగ్ ని గ్రాండ్ గా లాంచ్ చేశారు. నిర్మాత బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ.. ఈ సినిమా రీరిలీజ్ ని లైఫ్ లో మర్చిపోలేను. 21 ఏళ్ల తర్వాత 'లక్ష్మీ నరసింహా' సినిమాని రీరిలీజ్ చేస్తున్నానంటే నందమూరి అభిమానులకు ఏదో ఒక స్పెషల్, సర్ప్రైజ్ ఇవ్వాలి. ఎలాంటి సర్ ప్రైజ్ అని ఆలోచన వచ్చినప్పుడు.. ఈ సినిమా కోసం రెండు సాంగ్స్ చేశాం. ఒక సాంగ్ ని షూట్ చేసాంగాని సినిమాలో లేదు. ఆ సాంగ్ ని ఎలాగైనా రి రిలీజ్ లో యాడ్ చేయాలి అని ఆలోచన వచ్చింది. ప్రసాద్ ల్యాబ్స్ లో నెగిటివ్ దొరికింది. కానీ సౌండ్ దొరకలేదు సౌండ్ లేదు. ఓన్లీ పిక్చర్ ఉంది. పిక్చర్ ప్రింట్ చేసి ఫస్ట్ చంద్రబోస్ గారికి, తర్వాత డైరెక్టర్ గారికి, భీమ్స్ కి పంపించాను. వాయిస్, లిరిక్ రాసి రికార్డు చేయాలని చెప్పాను. బోస్ గారు ఇది ఎలా పాజిబుల్ అన్నారు. చేస్తేనే పాజిబుల్ అవుతుందని చెప్పాను. ఒకసారి ప్రయత్నించమని చెప్పాను. అయితే ఈ ప్రయత్నాన్ని అద్భుతంగా చేశారు. ఈ పాటని డిస్ట్రిబ్యూటర్స్ కి వినిపిస్తే పాట అద్భుతంగా ఉంది కొత్త సినిమాల్లో పెట్టండి బ్లాక్ బస్టర్ అవుతుంది అని చెప్పారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నందమూరి అభిమానులు ఈ సినిమాని ఈ సినిమాని మళ్లీ మళ్లీ పెద్ద హిట్ చేయాలని కోరుతున్నాను. బాలయ్య బాబు బర్త్ డే కి వస్తుంది. ఇందులో కొత్త సాంగ్ ఉంది. 4కె లో చాలా కష్టపడి మౌనిక రెడ్డి, అభిలాష్ రెడ్డి, వంశీ ఈ సినిమాని రెడీ చేశారు.

## అలాంటి పాత్రలు చేయకూడదు

సినిమా ఇండస్ట్రీలో రాణించాలంటే మామూలు విషయం కాదు. ఇండస్ట్రీలో చాలామంది నటులు, నటీమణులు టాలెంట్ ఉన్నా అదృష్టం లేక ఫేడ్ అవుట్ అవుతున్నారు. అందానికి అందం, టాలెంట్‌కు టాలెంట్ ఉండి కూడా ఏమాత్రం కెరీర్‌లో పెద్దగా హిట్లు లేని హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నిలిచారు. అయితే ఒకే ఒక సినిమాతో టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది మీనాక్షి చౌదరి. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ , మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కిన 'గుంటూరు కారం' సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. అంతకు ముందు కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ పెద్దగా గుర్తింపు దక్కలేదు. గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా చేసిన కూడా ఈ సినిమా ఆమెకు ఫుల్ పాపులారిటీ తెచ్చి పెట్టింది. దీంతో అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి సూపర్ హిట్లను తన ఖాతాలో వేసుకుంది. మీనాక్షి చౌదరి తెలుగులో ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తోంది. అయితే ఓ సినిమాపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది ఈ బ్యూటీ. ఆ సినిమా చేసి తప్పు చేశానని చెప్పి షాకిచ్చింది ఈ అమ్మడు. ఆ సినిమా మరేదో కాదు తమిళ స్టార్ హీరో విజయ్‌తో నటించిన 'గోట్'. ఈ సినిమా ఫలితంపై మీనాక్షి చౌదరి తన అసంతృప్తి వ్యక్తం చేశారు. బాక్సాఫీస్ వద్ద 'గోట్' మూవీ నెగిటివ్ టాక్ సొంతం చేసుకుంది. విజయ్ కెరీర్‌లోనే ఈ సినిమా అట్టర్ ఫ్లాప్‌గా నిలిచింది. పైగా ఆ సమయంలో ఈ సినిమాపై దారుణమైన ట్రోల్స్ నడిచాయి. మహేష్ బాబు సినిమాలో పెద్దగా ప్రాధాన్యత లేని పాత్రలో నటించి తప్పు చేసిన మీనాక్షి చౌదరి , ఇలా విజయ్ సినిమాలో సైతం ఇలాంటి పాత్రే పోషించి తప్పు చేసిందనే అభిప్రాయం వ్యక్తం అయింది. ఈ తమిళ స్టార్ హీరో కూడా మీనాక్షి చౌదరికి హిట్ ఇవ్వలేకపోయారనే అభిప్రాయం వ్యక్తం అయింది. తాజాగా మీనాక్షి చౌదరి సైతం ఈ సినిమా చేసి తప్పు చేశానని చెప్పడం సంచలనంగా మారింది. ఇలా ఇద్దరి స్టార్ హీరోలతో నటించినా మీనాక్షి చౌదరికి హిట్ దక్కలేదు. ప్రస్తుతం మీనాక్షి చౌదరి చిరంజీవి సినిమాలో నటిస్తోంది. చిరంజీవి ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమాలో మీనాక్షి దేవకన్యలా కనిపించనుందని సమాచారం.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నభా ఎమోషనల్ పోస్ట్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేసింది హీరోయిన్ నభా నటేష్. ఆమె ఇన్ స్టా గ్రామ్ ద్వారా చేసిన ఈ పోస్ట్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్ట్ తో నేచర్ గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. తన సోషల్ మీడియా పోస్ట్ లో నభా స్పందిస్తూ – ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను...ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతిని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్ కి రుణపడి ఉంటాను. అని పేర్కొంది. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ మూవీస్ లో నటిస్తోంది నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో ప్రెస్టీజియస్ మూవీ నాగాభరణంలో నటిస్తోంది. ఈ రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలుగా రూపొందుతున్నాయి.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. RNI: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**